స్కెచ్

# మూడుకాళ్ల ప్రజాస్వామ్యం

వడ్లపట్ల దయానందం

మా వూరి పంచాయతీబోర్డు ఎన్నికలు దగ్గర పడుతూన్నకొద్దీ, రోజురోజుకూ ఎన్నికల వాతావరణం ఉన్నతస్థాయి నందుకొంటోంది. రోడ్డంట పోతూంటే—ప్రజాస్వామిక విశిష్టత సుస్పష్టంగా గోచరిస్తోంది.

"ఎనుబోతు చెంచయ్య పరమ దుర్మార్గుడు. కనుక మీ వోటు పిట్టగుర్తుగల పెట్టెలోనే!" అని ఒక గోడమీద వ్రాసుంటే—

"బురఖా భీమయ్యని చూచి మోసపోకండి... పాత ప్రెసిడెంటు చెంచయ్యకే మీ వోటు... గొడుగు గుర్తు, మరువకండి"అని ఇంకో గోడమీద వ్రాసుంది.

పట్నంనుంచి రెండువేల వాల్ పోస్టర్లు, పెద్ద పెద్ద అక్షరాలతో తన పేరు అచ్చు గుద్దించి తెచ్చి వూళ్ళో గోడలనిండా చెంచయ్య అంటించాడన్న వార్త తెలిసినా, భీమయ్య మిన్నకుండే సరికి-భీమయ్య వర్గానికి తలవంపుగా తోచి, నాలుగు వేల పోష్టర్లు అచ్చు గుద్దించటానికి ఎలాగైతేనేం భీమయ్య నొప్పించారు. ఐతే పోస్టర్లమీద వ్రాత ఎలా ఉండాలా అన్న నిర్ణయానికిగాను, పట్నంలో తొమ్మిదో క్లాసు చదువుతున్న భీమయ్య చిన మేనల్లుణ్ణి రప్పించారు. తీరా వచ్చాక—చదువుకున్నవాడు అండగా ఉండడం ఎందుకైనా మంచిదని తోచి— ఒక వారం రోజులకి సెలవు చీటీ వ్రాయించి, స్కూలుకి పంపించేశారు. ఇది నిశానీ భీమయ్య-దౌర్బల్యంగా ఎదుటిపక్షంవాళ్ళు ప్రచారం చేస్తూ ఉండడంవల్ల "ఏడ్చేరులే- ఆ చెంచయ్య మట్టుకు ఏడ్చింది మూడో క్లాసేగా" అనుకుని సంతృప్తిపొందారు-భీమయ్యపక్షీయులు. అక్కడికీ భీమయ్య ఒకరోజున మేనల్లుణ్ణి చాటుకు పిలిచి అడిగాడు "ఏరా అబ్బి ఒక రెండు రోజుల్లో సంతకంచెయ్య నేర్చుకోవచ్చా?" అని.

మేనల్లుడు నవ్వేసేసరికి "సరేలే ఊరుకో ఎక్కడా అనబోకు" అనేశాడు భీమయ్య, గుబురు మీసాలు ఠీవిగా ఒత్తుకుంటూ.

అసలు ఇంతకుముందు చెంచయ్య పోటీ లేకుండానే ఎన్నికయ్యాడు. అయితే ఆమధ్య భీమయ్య పెద్దమేనల్లుడు తాలూకు యాభైరూపాయలు, ప్రోనోటు బాపతు, వ్యవహారాల్లో తన సిఫారుసు ఖాతరు చేయలేదన్న పగ బుసలుకొట్టి సమయానికి బయటపడి చెంచయ్యను ఎలాగైనా ఓడించాలన్న పంతంతో పోటీపెట్టేశాడు భీమయ్య. చెంచయ్యతో చల్లగాకబుర్లు చెబుతూనే చాలాభాగం చాటుగా చీల్చేశాడు.

ఆరోజు భీమయ్యవర్గం సమావేశమై కార్యక్రమాన్నిగూర్చి చర్చిస్తూండగా సుడిగాలిలా వచ్చిపడి చెప్పాడు చిన్నమేనల్లుడు, "వచ్చే సంవత్సరంలో మనూరికి కరెంటువస్తుందట, గవర్నమెంటు శాంక్షన్ క్రిందటి సంవత్సరమే ఐందట, నన్నెన్నుకుంటే మనూరికి కరెంటు లాక్కొచ్చేస్తానని ప్రచారం చేస్తేసరి, ఇట్టేపడుతై ఓట్లు" అని.

సలహా నచ్చింది భీమయ్యకి, "సెబాష్‌రా పిడుగా" అనేశాడు సంతోషంతో.

"అందుకే నేచెప్పలా చదువుకున్నోడి అండుంటే ఎందుకైనా మంచిదని" అన్నాడు భీమయ్య ఆంతరంగికుడు—తన సలహావల్లే ఈ సత్ఫలితం—కలిగిందన్న విషయాన్ని బహిర్గతంచేస్తూ.

ఇంతలోనే మరొకడికి తాజా ఆలోచనతట్టి-

"దొరా-చెవిలో చిన్నమాట"అన్నాడు.

చెవిలో మాటవిన్నాక, ఆలోచనల్లో పడ్డాడు భీమయ్య. అవును తనకీఉంది ఈ ఆలోచన! ముండమోపి ఐదెకరాలున్న ఆ చెంచయ్యగాడి ఇలాకాలో, బస్తీనుంచి వొచ్చిఉన్న 'సుందరమ్మ'వల్ల ఇరవై ఎకరాలు కలిగిఉన్న తన కెంత నామర్దా?

తీస్తే సరిగ్గా దీనిలోనే దెబ్బతియ్యాలి. ఇక తలెత్తుకోలేడు వెధవ" అనుకున్నాడు భీమయ్య.

"ఏటి దొరా, అంతోటి గోప్యరాసిం మాకు చెప్పకూడదా?" అంటూ నిగ్గదేసిన అనంతరం, విషయాన్ని బహిర్గతం చేయక తప్పలేదు భీమయ్య.

భీమయ్య చెప్పింది విన్న తరువాత "అదెంతపని దొరా! ఆడు దాని మొఖాన్నేమన్నా రాత్తేగదూ! ఒక్క రెండెకరాలు మనవి కాదనుకుండే సరి, రే పీపాటికి రైటుచెయ్యనూ" అంటూ బరోసా ఇచ్చేశాడు చిన్నెంకడు.

రెండెకరాలు వ్రాయడానికి అంగీకరిస్తూ, సుందరమ్మ నొప్పించవలసిన బాధ్యతను చిన్నెంకడి బుజాలపై పారేస్తూ నిర్ణయం చేయబడింది.

అనుకోకుండానే ఇంకో పితూరీ దొరొచ్చి పడ్డాడు భీమయ్యగుంపులోకి. "చూచారండీ బాబూ ఆ ఎదవ, ఎంతపని చేశాడో! నేనూ మా వాడకట్టూ, తమ కొమ్ము కాశామని పురంద రయ్యగారికి రాసి ఇచ్చిన రెండువందల ప్రోనోటు తనపేర ట్రాన్సఫర్ చేయించుకొని నోటీసు లేకుండానే ప్లెయింటీచేసి ఇల్లు జప్తుకెట్టాడు దుర్మార్గుడు! ఎట్టా నెగ్గుతాడో సూత్తాగా!" అంటూ చేతికర్రతో నేల నొక్కపోటు పొడిచాడు. లాల్చీ జేబులోంచి నోట్లకట్టతీసి అందిస్తూ "ఆ వెధవ మొఖాన్న కొట్టేయ్! నువ్వుమట్టుకు గూడెంలో ఒక్కోటు కూడా జారిపోకుండా సూత్తాఉండు" అన్నాడు భీమయ్య.

"ఒక్కటైనా జారనిత్తానా దొరా! చూత్తా రుగా" అంటూ అదృశ్యమైపోయింది ఎలక్షన్‌పక్షి.

ఆ మర్నాడు, కొందరు జండాలు పట్టుకుని, బండీకి స్పీకర్లుకట్టి "చంచయ్యాకే మీవోట"ని గగ్గోలుగా అరుస్తూ ఊరంతా చెడతిరుగుతూ ఉండేటప్పటికి భీమయ్యకి చెమటలు పట్టేనయ్.

"ఎవరు ఈళ్ళంతా?" అని అడిగినమీదట- అంతరంగికుడు చెప్పాడు. "బస్తీలో ఏదో పార్టీ బాపతు కుర్రోళ్ళు. మూడొందలు కడితే-ఈ అరిసే కుర్రోళ్ళతో బాటే, మీటింగ్ చెప్పే నాయకు నొకణ్ణీ బుర్రకథ చెప్పేవాళ్ళనీ కూడా పంపుతా రట. కావాలంటే ఇంకో పార్టీ వాళ్ళని ... మరి రెండొందలు ఎక్ట్రా-కట్టి-కొట్టు కొచ్చేద్దాం"అని.

ఈ ఆలోచన కూడా నచ్చింది.

మెరికెల్లాంటి కుర్రోళ్ళని-నిప్పులాంటి నాయ కుణ్ణి-కొట్టుకొచ్చేయమని ఐదొందల నోట్లు పొట్లం కట్టిచ్చేశాడు.

ఆ మర్నాడే ఎలక్షన్‌లు.

చెంచయ్య తరఫు ప్రచారసరుకు, భీమయ్య తరఫు ప్రచారసరుకు, అరుపుల్లో హోరాహోరీగా పోటీపడుతున్నయ్. ఫలానా ప్రచండ నాయకుడైన నారాయణరావుగారు, అఖండంగా ఆ రాత్రికి లైబ్రరీ హాలుదగ్గర ఏర్పాటు చేయబడే బహిరంగసభలో ఉపన్యసిస్తారని, బ్రహ్మాండమైన ప్రచారం చేయబడింది. "ఓస్ ఆడేరా...బస్తీలో కిళ్ళీకొట్టు నారిగాడు!"అనేశారు చెంచయ్య పక్షం వాళ్ళు.

చీకటి పడుతూండనగానే మీటింగు దిబ్బదగ్గర జనం చేరుకున్నారు. అందాకా స్పీకర్లలోంచి రికార్డులు వినిపిస్తున్నారు.

"ఆ ఆ-లు రానట్టె అన్నయ్యలందరకు అధికార యోగమ్ము పడుతుందయా" అన్న చరణం విని, భీమయ్య మండిపడి, ఆ పాట నాపేయించండని హుకుం జారీచేశాడు. పైపెచ్చు, "ఆ పాడేవాడికి బుద్ధుండేగా"అని కస్సుమన్నాడు కూడా. "పాడే వాడిదేముంది మామా! రాసినోడిదే ఆ తప్పంతా." అన్న మేనల్లుడి మాటలకి ఆశ్చర్యపోయి. "ఆ... ఆ....అలాగా....రాసేదొకడూ-పాడేదొకడూనా!" అన్నాడు భీమయ్య విస్మయంతో.

బహిరంగసభ మొదలైంది.

ఉపన్యాసం ఎత్తుకోవడంలోనే భీమయ్యవంటి నిష్కళంక ప్రజాసేవకునికి జన్మస్థానమైన కారణం వల్ల ఈ పురానికి, ఎంతైనా పవిత్రత చేకూరిందన్న నాయకుని మాటలువిని తన్మయత్వంలోపడి "ఇరవై ఎకరాలు పోయినా మాబాగే" అనుకున్నాడు వేదికమీద కుర్చీలో, దండలతో కూర్చున్న భీమయ్య.

ఎన్నికలు కాస్తా గడిచినై; ఫలితాలు కూడా ప్రకటించబడినై.

మూడోట్ల తేడాతో చెంచయ్య గెలిచాడన్న వార్త వినగానే కొయ్యబారి ముందుకు పడబోతున్న భీమయ్యని, అంతరంగికుడొచ్చి నిల పెట్టాడు.

"మూడోర్లోగా! ఎక్కడికిపోతాడు దొంగోట్లే యించాడని కేసుపాగే స్తేసరి! తీర్పు తప్పకుండా మనపక్షమే ఔతుంది" అని సలహాయిచ్చాడు ఆంతరంగికుడు.

భీమయ్యకి ఈ సలహాకూడా బాగానే నచ్చింది. దావా పడేశాడుకూడా.

ఇరుపక్షాలవారు, స్వబలగసమేతంగా ప్రతి వాయిదాకి, బస్తీకి ప్రయాణంకడుతూనే ఉన్నారు. ఇంకో మూణ్ణెల్లకి తీర్పువచ్చేస్తుందన్న సంతృప్తి ఇరుపక్షాలవారూ పొందుతూనే ఉన్నారు.

"రెండున్నర సంవత్సరాలు ఎలాగూ గడిచిం దయ్యె. ఇంకో ఆరుమాసాలకి ఎలాగూ క్రొత్తెన్ని కలొస్తయిగా" అంటూ భీమయ్య పక్షంవాళ్ళ నుద్దేశించి చెంచయ్య ఎద్దేవగా అంటూ ఉంటాడని వినికిడి.

మొత్తంమీద ఒకటేమాత్రం నిజం! ఇరవై ఎక రాల కామందు భీమయ్య స్థిరాస్థిపుడు రెండకరాలు మాత్రమే! దానికితోడు నమ్మించి మోసంచేసిన బస్తీ సుందరమ్మిప్పుడు మళ్ళీ చెంచయ్య ప్రాపకం లోనే ఉంది.

---

గల్పిక

# ప్రణయానికి పొలిమేరలు

## జ్యేష్ట

మా చిత్రం "శంఖారావం"లో ఔట్ డోర్ షూటింగ్ కని ఆ ఊరు సెలక్టుచేశాం. ఆ ఊరు ఓ చెఱువుకి ఓ వేపునఉంది. చెరువుకి మిగి లిన మూడువైపులా కొండలు, బండలు. చెఱువు దక్షిణపు గట్టున ఊరికి సమీపాన పాడుపడిన కోవెల. తరుచుగా జాతరలాంటిది జరుగుతూ ఉంటుంది. జాతర సమయాల్లో ఊరంతా కోవెల వద్దే ఉంటుంది. కల్లుబాన లదేపనిగా చేరుతాయి గుడికి చేరువగా. మగాళ్లంతా మైమరచేట్లు తప్ప తాగి తందానలాడతారు; అది జానపద నృత్యమని వాళ్లకి తెలియదు., (అదృష్టవశాత్తు ఆ రోజున తిరునాళ్ల జరుగుతున్నాయి, మేం ఆ నృత్యమే షూట్ చేశాం. కల్లుకడవలు కనపడనీయలేదు.) ఆరాత్రి మా టెంటుకి కాపలాకాయటానికో మున లతన్ని ఆ ఊరివాణ్ణే రప్పించాం. నాకు నిద్ర రావటంలేదు. అతను నిటారుగా నిలపడి టెంటు చూట్టూ చూస్తున్నాడు.

"కథ చెప్తావాదొరా!" అన్నాను. "ఊఁ," అన్నాడతను. నేను టెంటునుధూమమయం చేస్తూం డగా అతను అభినయంతో ఈకథ చెప్పసాగాడు.

రెండుతరాల క్రితం ఈఊరు ఇంకా చిన్నది. ఈ గుడి అందంగాఉంది. ఈ ఊరులో ఎవరికీ సొంతభూమిలేదు. ఇదీ, మరో నాలుగైదు పల్లెలు కొండయ్యనే కొండ దొరవి, ఆదొర మహాబలశాలి. ఏడాదికో పులిని చంపుతుంటాడు. దయ, ప్రేమ అతనిలో ఇంకా కలుగలేదు. అతనికి కోపం కలి గితే ఎదుటివాడిపని సరి. అతనికి ఆనందం కలిగినా అంతే! ఆనందావేశంలో ఎదుటివాణ్ణి ఊపిరి సలప కుండాచేసి చంపుతాడు. కాని అతని కులదైవం 'చండి' పేరు వింటేచాలు—చావటానికి తయారౌ తాడు దేవత పేరువిని. అతన్ని అదుపులో ఉంచ గలిగింది దేవి పేరు ఒకటే, అదే అతని ప్రత్యేకత; బలహీనత.

ఆ రోజున తిరునాళ్ల ఉదయాన్నే దొర ఒంట రిగా కోవెలకొచ్చాడు. ఉదయంనుంచీ ఉపవాసం, చీమనడచినా వినపడుతుంది. ఆ సమయంలో అలి కిడిలేదు...రవి పడమటి కడలిలో మునిగి మరి కనిపించలేదు. దొరలేచాడు దేవి ముందునుంచి.

ఆఊరికల్లా సాధువు నరుసు. అతనికూతురు యెంకి ఆ ఊరి అందాలరాణి. చిలిపి పనులలో సాటిలేనిది. అదే సమయంలో ఒంటరిగా దేవి దర్శనానికి తయారైంది. దొరచూశాడు—ఆమెపై మనసు నిలిచింది. అతని మనంలో మరులువిరిశాయి. అతనిలో లలితభావం కలగటం అదే మొదటిసారి.

దొర వెనకనుండే యెంకిని సమీపించాడు. ఆమె చెఱువుమీద చూపునిలిపింది. కదలికలేని మనోహర శిల్పసుందరిగా కనపడుతోంది. దొర ఆమె నడుంపట్టుకొని గుట్టంపై కూర్చోపెట్టాడు.